వరద ఉధృతికి లంక గ్రామాలు విలవిల

- డ్రెయిన్ల ప్రక్షాళనతోనే సమస్యకు పరిష్కారం
- ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్


వరదల కారణంగా ముంపుబారిన పడిన గుడివాకలంక ఎస్సీకాలనీ ప్రజలు

ఏలూరు రూరల్ : వరద ఉధృతికి కొల్లేరు లంక గ్రామాలు విలవిల్లాడుతున్నాయి. ఇల్లు, వాకిలి, ఊరు, వాడను కొల్లేరు ముంచెత్తుతోంది. చేపల చెరువులు ముంపుతో ప్రజలు జీవనోపాధి కోల్పోయారు. ప్రభుత్వం స్పందించి డ్రెయిన్ల ప్రక్షాళన చేపట్టి, కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఏటా ముంపే

వర్షాకాలంలో తమ్మిలేరు, బుడమేరు నుంచి వేల క్యూసెక్కుల వరద నీరు కొల్లేరులోకి చేరుతుంది. కొల్లేరు ప్రధాన డ్రెయిన్లు పూడుకుపోవడంతో వరద నీరు వేగంగా కిందకు పారడం లేదు. కొన్నేళ్లుగా వరద నీటితో ఎగువ నుంచి వచ్చే బురద, మట్టి కలిసి కొల్లేరులో సుమారు 10 అడుగుల ఎత్తున మేటలు వేశాయని లంకగ్రామాల ప్రజలు చెబుతున్నారు. వరదలతో కొల్లేరులోనికి పెద్ద ఎత్తున గుర్రపుడెక్క కొట్టుకొస్తుంది. ఇది కొన్ని రోజులకు కుళ్లి కొల్లేరులో కలిసిపోతోంది. ఫలితంగా ఏడాది పాటు నిండుకుండలా ఉండాల్సిన కొల్లేరు వరదల సమయంలో ఒక్కసారిగా ఉప్పొంగి ఊళ్లను ముంచుతుంది. ప్రజలను కష్టాల పాలు చేస్తుంది. వేసవికాలంలో చుక్కనీరు లేని ఎడారిలా మారిపోతోంది. 50 ఏళ్ల క్రితం వరకు లంక ప్రజలకు జీవనోపాధి కల్పించి, మత్స్య జనంలా కనిపించిన కొల్లేరు నేడు బీడు భూమిగా మారింది. ఈ నేపథ్యంలో జీవనోపాధి కోసం లంక గ్రామాల ప్రజలు చేపల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా భావించి బడాబాబులు అభయారణ్యంలో అక్రమ చెరువుల తవ్వుతున్నారు. దీంతో కొల్లేరుకు వరద పోటెత్తిన ప్రతిసారి లంకగ్రామాలు, చెరువులతో పాటు దిగువన ఉన్న వందలాది ఎకరాల్లో పంటచేలు కూడా ముంపుకు గురవుతున్నాయి.

ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం తక్షణం కొల్లేరు డ్రెయిన్లు ప్రక్షాళన చేయాలి. 1982, 2000 సంవత్సరంలో కొల్లేరులో కొన్ని డ్రెయిన్లు పూడిక తీశారు. ఏళ్ల తరబడి ప్రవహిస్తున్న వరదనీరు కారణంగా కొల్లేరులో మూర్తిరాజు డ్రెయిన్, మొండుకోడు, కొండేపుంత, నక్కలకోడు తదితర ప్రధాన డ్రెయిన్లు పూడుకుపోయాయి. దీంతో కొల్లేరు గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. మేం అనేక ఏళ్లగా ముంపు బాధలు పడుతున్నాం. మా కష్టాలు పట్టించుకునే నాథుడే కానరావడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించాలి.

– జయమంగళ రామారావు, ఏలూరు మండలపరిషత్ మాజీ అధ్యక్షుడు

రెగ్యులేటర్ నిర్మించాలి



ప్రభుత్వం తక్షణం రెగ్యులేటర్ నిర్మించాలి. కొల్లేరులోకి వచ్చే వరదనీరు వేగంగా కిందకు పారడంతో పాటు ఉప్పునీరు కొల్లేరులోనికి రాకుండా అడ్డుకోవచ్చు. వైఎస్సార్ సీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులేటర్ నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా పనులు ముందుకు సాగలేదు. కొల్లేరుకు పూర్వ వైభవం రావాలంటే నేటి ప్రభుత్వం ఈ పనులు పూర్తి చేయాలి. అప్పుడు లంకగ్రామాల ప్రజలకు జీవనోపాధి లభిస్తుంది.

– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డీల కార్పొరేషన్ మాజీ చైర్మన్, పైడిచింతపాడు

క్లుప్తంగా

పౌష్టికాహార లోపంతోనే ఎనీమియా


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం వల్లే ఎనీమియా వ్యాధి వస్తుందని సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. స్థానిక 35వ డివిజన్ గానుగుల పేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ పావని మాట్లాడుతూ ఐరన్‌లోపం వల్లే ఎనీమియా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం మౌనిక ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వైఎంహెచ్‌ఏ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) సభ్యులు గురువారం ఎంపీ పుట్టా మహేష్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కళాకారులను, కళా సంస్థలను ప్రోత్సహించే విధంగా నూతన ప్రభుత్వం కృషి చేయాలని ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ కళాకారులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎంహెచ్‌ఏ కార్యవర్గ సభ్యులు యర్రా సోమలింగేశ్వర రావు, కేవీ సత్యనారాయణ, అంబికా రాజా, మజ్జి కాంతారావు, కేబీ రావు, ఎంవీవీఎస్ నాగేశ్వర రావు, ఎం సూర్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

14న కృతజ్ఞత స్తుతి కూడిక

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఈ నెల 14న బేతేలు ప్రార్థన మందిరంలో కృతజ్ఞత స్తుతి కూడిక నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు, బేతేలు ప్రార్థనా మందిర ఫాస్టర్ సీహెచ్ విలియం తెలిపారు. సువార్తికులు ఉదయభాస్కర్ విచ్చేస్తారని, సమీప గ్రామాల్లోని భక్తులు ఈ కూడికకు హాజరుకావాలని కోరారు.

ఐరన్ మాత్రల పంపిణీ

గణపవరం: విద్యార్థులు రక్తహీనత కలిగి ఉంటే చదువులో వెనుకబాటుకు గురవుతారని, అందువల్ల ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని గణపవరం మండలం కాశిపాడు జెడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. కొత్తగూడెం సెంటర్, 7 కాలువల సెంటర్, చాటపర్రు రోడ్డు, తూర్పు వీధి సాయి బాబా గుడి సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ గుడి ఏరియా, ఫిల్ హౌస్ పేట, వీవర్స్ కాలనీ, పోణంగి రోడ్డు, చిరంజీవి బస్ స్టాప్ సెంటర్, దక్షిణపు వీధి, కుండీ సెంటర్, గడియార స్తంభం ఏరియా, కత్తేపు వీధి, తూర్పు వీధి, న్యూ మార్కెట్ ఏరియా, బెనర్జీ పేట, వెన్నవల్లి వారి పేట, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, అగ్రహారం, మెయిన్ బజార్, కెనాల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీటీడీ కళ్యాణ మండపం, సీఆర్ఆర్ కాలేజీ ఏరియా, కలెక్టర్ బంగ్లా, జెడ్పీ బంగ్లా, గ్రేవియర్ హైస్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

విద్యుత్ బిల్లుల మోత

దెందులూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. వర్షాకాలంలోనూ పెద్ద మొత్తంలో బిల్లులు వస్తున్నాయి. ఏలూరు మండలం జాలిపూడికి చెందిన కె.నాగేశు మాట్లాడుతూ తన ఇంటికి ఎప్పుడూ రూ.800 నుంచి రూ.1500లు మాత్రమే నెలవారీ బిల్లు వచ్చేందని, ఆగస్టు నెలలో రూ.2800 వచ్చిందని తెలిపారు. తన వీధిలో ఐదు ఇళ్లకు రూ.2800 చొప్పున విద్యుత్ బిల్లు వచ్చిందని వాపోయారు.

సీపీఎం అగ్రనేత ఏచూరి మృతికి సంతాపం


ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఆ పార్టీ నాయకులు స్థానిక కార్యాలయంలో గురువారం సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సంతాప సభలో ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు గుడిపాటి నరసింహారావు మాట్లాడారు. సీతారాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ లింగరాజు, ఎం నాగమణి, కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ తీవ్ర సంతాపం

సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏచూరిని స్ఫూర్తిగా తీసుకొని పార్టీలో పనిచేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళులని పేర్కొన్నారు. ఏచూరి మృతికి సంతాపంగా సీపీఎం కార్యాలయంపై ఉన్న జెండాను క్రిందకు దింపినట్టు తెలిపారు.

ఉద్యమానికి తీరని లోటు

ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావులు గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

సంతాపాలు

సీతారాం మృతికి ఎంసీపీఐ (యు) రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ మేరకు పార్టీరాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏచూరి మృతిపట్ల ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి మహోత్సవాలు


కొత్తపేటలో గణపతి పూజల్లో పాల్గొన్న మహిళలు


ఊరేగింపులో చిన్నారుల నృత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద మండపంలోని గణనాథునికి విశేష పూజలు చేశారు. స్వామివారికి వివిధ రకాల పలాలతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. ఎస్ఎస్ కూరగాయల మార్కెట్, కుండీ సెంటర్, పేరయ్య కోనేరు ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథులకు విశేష పూజలు చేశారు. కొత్తపేట గిలకల గేటు సెంటర్‌లో కూనిశెట్టి వారి వీధిలో లక్ష్మీ గణపతిని వివిధ రకాల పండ్లు, పుష్పాలతో పూజించారు. ఈ సందర్భంగా చిన్నారి మన్నెం జ్ఞాన శ్రిత కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించింది. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయం, ఎస్ఎస్ కూరగాయల మార్కెట్ వద్ద గణపతి మండపాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు స్థానిక విజయవిహార్ సెంటర్‌లోని గణపతి మండపాల్లో స్వామివారికి పూజలు నిర్వహించారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు

నగరంలో గురువారం దాదాపు 30 గణపతి విగ్రహాల నిమజ్జనం జరిగినట్టు అంచనా. నిమజ్జనానికి తరలిస్తున్న సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. యువకులు బాణసంచా కాల్చుతూ గణపతికి వీడ్కోలు పలికారు. ఊరేగింపులో విచిత్ర వేషధారణలు, కుర్రకారు ఆనందోత్సాహాలతో చేసిన నృత్యాలు చూపరులను ఆకర్షించాయి. కాగా నగరంలో మరి కొన్ని ప్రాంతాల్లో భారీ గణనాథులు తమకు ఏర్పాటు చేసిన వేదికల్లో మరో మూడు రోజులపాటు పూజలు అందుకోనున్నారు. ఉత్సవాల ముంగిపు సందర్భంగా 10వ రోజు ఈనెల 16వ తేదీన భారీ నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు.




ఏలూరు వన్‌టౌన్‌లో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న వినాయక విగ్రహాలు

బాలసదనంలో సౌకర్యాలపై ఆరా

దెందులూరు: స్థానిక బాల సదనాన్ని ఐసీడీఎస్ నోడల్ అధికారి కె.స్వరాజ్యలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మరుగుదొడ్లు, బెడ్లు, విద్యుత్, తాగునీరు, నాలుగువైపులా ప్రహరీ, భవన పటిష్టతను పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. భోజన రుచి, నాణ్యతపై ఆరా తీశారు. వంట షెడ్డును పరిశీలించారు. స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాలసదనం విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మిషన్ వాత్సల్యంలో ఉన్న అన్ని ఐటమ్స్ సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాలో నిరాదరణకు గురైన బాలలను ఆదరించాలని సూపరింటెండెంట్ బేబీ సరోజినికి సూచించారు. ఆమె వెంట డీసీపీఓ డాక్టర్ సూర్యచక్రవేణి ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమోటాలు	34	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44-60	ములక్కాడలు	5,10
బెండకాయలు	56	కంద	50
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	40	కీరా దోస	50
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	78
బీరకాయలు (పందిరి)	64-74	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	40
క్యారెట్	40	పాలకూర	15
దొండకాయలు	40	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	54	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	78
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	50

బియ్యం, దుస్తుల పంపిణీ


గోగుంట గ్రామంలో దుస్తులు, బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు


విరాళాలు అందిస్తున్న ఉప్పాకపాడు విద్యార్థులు

వరద బాధితులకు విద్యార్థుల సాయం

పెదపాడు : వరద బాధితులకు విద్యార్థుల సాయం అందించడం గొప్ప విషయమని వికార్ జనరల్ ఫాదర్ బాల, సెయింట్ జోషఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజేష్ అన్నారు. గురువారం పెదపాడు మండలం గోగుంట గ్రామంలో ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ చైర్మన్ ఫాదర్ బిషప్ పొలిమేర జయరావు ఆదేశాల మేరకు డైరక్టరు ఇమ్మానియేలు ఆధ్వర్యంలో వరద బాధితులకు సెయింట్ థెరిస్సా విద్యార్థులు అందించిన సాయంతో ఒక్కొరికీ ఏడు కేజీల బియ్యం, సెయింట్ జోషఫ్ డెంటల్ కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు అందించిన సాయంతో చీర, లుంగీ, రెండు సబ్బులు, రెండు షాంపులు చొప్పున 106 కుటుంబాలకు అందించారు. ఫాదర్లు జేకబ్, ఐ.మైకేల్, మిల్కియార్, ఎం రాజు, సిస్టర్ క్రిస్టియా పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళం

ఉంగుటూరు: విజయవాడ వరద బాధితులకు ఉప్పాకపాడు పాఠశాల విద్యార్థులు 15 వేలు సేకరించారు. మూడు రోజులుగా గ్రామంలో వారు విరాళాలు సేకరించారు.

ఎమ్మెల్యేకి విరాళల అందజేత

ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వరద బాధితుల కోసం గురువారం యర్రమళ్లకు చెందిన కాజ సత్యనారాయణ గ్రామస్తుల తరపున రూ.47,300 అందజేశారు. గొల్లగూడెం సూర్య హైస్కూల్ తరపున వేములపల్లి సుధీర్, చైతన్యలు రూ.70 వేలు, గొల్లగూడెం సర్పంచ్ కరపాశ్రీను, నెక్కలపూడి సత్యనారాయణ, వేములపల్లి సుధీర్, దాసరి శేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రూ.3,41,000 ఎమ్మెల్యేకి అందజేశారు. అప్పారావుపేట గ్రామస్తులు రూ.29,148, నారాయణపురం ముదునూరి నర్సిహరాజు రూ.10 వేలు ఎమ్మెల్యేకి అందజేశారు.

వరద నష్టం నమోదు పూర్తి చేయాలి


వరద నష్టాలను అంచనాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖాజావలి

పెదపాడు : వరద నష్టాల అంచనాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీటో ఎస్ఎస్‌కే ఖాజావలి అధికారులను ఆదేశించారు. గురువారం పెదపాడు మండలం అప్పనవీడు సచివాలయంలో పంట నష్టాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పంట, పశు, ఇళ్ల నష్టాలపై ఆరా తీశారు. వరదల వల్ల పంట నష్టం అంచనా వేయడానికి ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. వరద నష్టాలు, బాధితుల డేటా యాప్‌లో నమోదు చేశామన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ డి.ప్రసాద్, వీఆర్వోలు సాంబశివరావు, కరీం పాల్గొన్నారు.

కుటుంబరావు లేని లోటు తీరనిది

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఖండ్రికనర్సింహాపురం సీనియర్ నేత సరిపల్లి కుటుంబరావు ఆకస్మిక మృతి తీరని లోటని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచీ క్రమశిక్షణ, పార్టీ అభివృద్ధే లక్ష్యంగా సేవలందించారని గుర్తుచేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటి సుధాకర్, సర్పంచ్‌లు యలమర్తి రేవతి, బైగాని వెంకటేశ్వరమ్మ, పరసా లక్ష్మిసుజాతలు సరిపల్లి కుటుంబరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న హెచ్ఎం పాశం

భీమడోలు: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంఆర్సీలో గురువారం విద్యా విషయాక అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఎంఈఓ-1 శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ యూడైస్ ప్లస్, ఎండీఎం, పరీక్షల మూల్యాంకనం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలందర్నీ పాఠశాలల్లో చేర్పించాలని, బడికి దూరంగా ఉన్న వారిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. యూడైస్ ప్లస్‌లో పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి పక్కా సమాచారాన్ని పొందుపర్చాలని, ఆధార్ నెంబర్, వారి ఫోన్ నెంబర్ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు అందించాలని, పాడైన కోడిగుడ్లు, బరువు తక్కువ కోడిగుడ్లను తీసుకోవద్దని తెలిపారు. పాఠశాలల్లో శానిటేషన్ ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, ఇటీవల జరిగిన పరీక్షల మూల్యాంకనపు ఫలితాలను నమోదు చేయాలని అన్నారు. నవోదయ, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు రాసే వారి సంఖ్యను పెంచాలని తెలిపారు. తొలుత యుడైస్ ప్లస్, స్కూల్ యాజమాన్య కమిటీ వివరాల ఆన్‌లైన్ చేసే విధానంపై హెచ్ఎం పాశం పాండురంగారావు టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్ఎం, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.